క్లుప్తంగా

అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో చేపట్టిన అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రారంభించారు. కార్యక్రమంలో సేవాదళ్ ప్రతినిధులు ఉబేద్‌బిన్ యాహియా, ఎండీ రఫ్, ముబారక్, ఇర్ఫాన్, ఆదిల్, సయిాద్, అబ్దుల్లా, అకిబ్, ముత్తు పాల్గొన్నారు.

సంచార వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ కేంద్రంలో శనివారం సంచార వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ అన్నిగా పరిశీలించి మాట్లాడారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఉచితంగా వైద్యం అందించడంలో భాగంగా చౌపన్‌గూడ గ్రామంలో మూడురోజుల పాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వల్ప అనారోగ్యంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంచార వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలి



వాహనపత్రాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

రెబ్బెన: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని రెబ్బెన ఎస్సై భూమేశ్ అన్నారు. శనివారం గోలేటి ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేసి పత్రాలు సరిగా లేని వాహనాలకు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శేఖర్ పాల్గొన్నారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత



స్వాధీనం చేసుకున్న గడ్డిమందుతో పోలీసులు

వాంకిడి: అక్రమంగా మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న నిషేధిత గడ్డిమందును శనివారం పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా నాందేవ్ అనే వ్యక్తి కారులో గడ్డిమందు తరలిస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 87,600 విలువ గల 120 లీటర్ల గడ్డిమందు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జాడి మిలింద్ కుమార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష



ఏర్పాట్లపై చర్చిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఏరియాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియాలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థ సీఅండ్‌ఎండీ ఆదేశాల మేరకు జూన్ 2, 5వ తేదీలలో నిర్వహించే వేడుకల ఎజెండా, నిర్వహణ బాగుండాలని ఆదేశించారు. వేడుకల నిర్వహణ కోసం మైదానాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎస్ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీష్‌బాబు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.



ఆపద్బాంధవులు..!

మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నిరుపేద కుటుంబాల వారు, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు సంఘటితమై మాఫౌండేషన్ స్థాపించారు. లోడెల్లి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మాఫౌండేషన్ కార్యక్రమాలు రెండేళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. దయను కలిగి ఉండి మానవత్వంతో వ్యవహరించాలనే ఆలోచనతో వీరు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముత్తంపేటలో అగ్ని ప్రమాదంతో సర్వం కోల్పోయిన కుటుంబాలకు నిత్యావసరాలతో పాటు దుస్తులు అందజేశారు. ఖర్జెల్లి గ్రామానికి చెందిన అంధ వృద్ధ దంపతులు మండిగ గోపాల్, సోమక్కల పరిస్థితి తెలుసుకొని సామగ్రి, దుస్తులు అందించారు. ప్రతీ నెల 11 కుటుంబాలకు నిత్యావసరాలు అందిస్తున్నారు. ప్రతీవారం రవీంద్రనగర్, చింతలమానెపల్లి మండల కేంద్రాలలో నిర్వహించే వారసంతల్లో అంబలి, మంచినీటి పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు సైతం అందజేశారు. మండలంలోని ఖర్జెల్లి అటవీ ప్రాంతంలో స్థానికుల సహకారంతో జంతువులకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు పండ్లు, కూరగాయలు ఆహారంగా ఇస్తున్నారు.

సేవ చేయాలంటే ఆర్థిక బలం కంటే కూడా అవసరానికి ఆదుకోవాలన్న తపన ఉంటే చాలని నిరూపిస్తున్నారు మండలానికి చెందిన పలువురు యువకులు. మంచి చేయాలనే ఆలోచనతో ఇతర మిత్రులు, ప్రజల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మా ఫౌండేషన్, శ్రీశివరామసాయి యూత్ పేరిట సంఘాలు ఏర్పాటు చేసుకుని నిరుపేద కుటుంబాలకు, దివ్యాంగులకు సేవ చేస్తూ ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు.

– చింతలమానెపల్లి

మనసు చలించింది..



ఖర్జెల్లి నుంచి మహారాష్ట్రకు వెళ్తుండగా అటవీ ప్రాంతంలో నీళ్ల కోసం మూగ జీవాలు అల్లాడుతుండడం ప్రత్యక్షంగా చూశాను. వేసవిలో వాటి పరిస్థితి చూసి మనసు చలించింది. విషయాన్ని మిత్రులతో చర్చించగా సహకరించేందుకు ముందుకొచ్చారు. దీంతో సుమారు 15 కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో వేసవి కాలం ముగిసే వరకు జంతువుల కోసం నీరు, ఆహారం అందిస్తున్నాం.

– లోడెల్లి ప్రవీణ్, చింతలమానెపల్లి

ఇంకా ఎన్నో కార్యక్రమాలు..



మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మండల కేంద్రంలో పరీక్షా కేంద్రం ఉంది. 12 కిలోమీటర్ల దూరం ఉన్న పరీక్షా కేంద్రానికి ప్రతీరోజు వెళ్లి రావడానికి పేద కుటుంబాల విద్యార్థులు ఇబ్బందులు పడే వారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేశాం. గ్రామ యువకులతో కలిసి ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం. – గుర్లె శ్రీనివాస్, డబ్బా గ్రామం

శ్రీశివరామసాయి యూత్..

మండలంలోని గ్రామాలలో నిరుపేదల సంఖ్య ఎక్కువ. కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా వీరు పడుతున్న ఇబ్బందులు గమనించిన స్థానిక యువకులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివేకానంద స్వామి స్ఫూర్తితో డబ్బా గ్రామానికి చెందిన గుర్లె శ్రీనివాస్, గ్రామ యువకులతో కలిసి 11 సంవత్సరాల క్రితం శ్రీశివరామసాయి యూత్ సొసైటీని స్థాపించారు. ఇప్పటి వరకు వీరు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. మండలంలోని డబ్బా, బోదంపల్లి, దరంపెల్లి, గ్రామాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు యువతలో చైతన్యం కలిగించి రక్తదాన శిబిరాలు సైతం ఏర్పాటు చేశారు. గ్రామాలలో పేదలకు బ్లాంకెట్లు, ఉన్ని దుస్తుల పంపిణీ వంటి కార్యక్రమాలతో పాటు వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పుడు విద్యార్థులకు ఉచితంగా యూత్ సభ్యులు పాఠాలు బోధించారు. నవోదయ, గురుకుల వంటి పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందించారు. స్థానికంగా గ్రామ సమస్యలపై స్పందించి రహదారులు బాగు చేయడం, పారిశుధ్యం, అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



కొనసాగుతున్న వీవోఏల సమ్మె

ఆసిఫాబాద్: కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద వీవోఏలు చేపడుతున్న దీక్షలు శనివారం 41వ రోజుకు చేరుకున్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన బాట పట్టినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని సంఘం నాయకులు వాపోయారు. ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సెల్వటిక, బద్దు, కీర్తి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



సుర్దాపూర్‌లో పనులు పరిశీలిస్తున్న అధికారులు

కెరమెరి: మండుతున్న ఎండల కారణంగా ఉపాధి హామీ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని సుర్దాపూర్, కెరమెరి గ్రామశివారుల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. టీఏలు, ఎఫ్‌ఏలు ఉన్నారు.

నియామకపత్రాలు అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న విశ్వప్రసాదరావు

ఆసిఫాబాద్: రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అవినాశ్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుల నియామకపత్రాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద రావు శనివారం రాష్ట్ర కోఆర్డినేటర్ కళావతితో కలిసి అందజేశారు. జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు

- జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రెండోవిడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సురేశ్‌కుమార్, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌తో కలసి లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా జిల్లాలో 1508 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. వీరిలో 485 మందికి తమ వాటా ధనం రూ. 43,750 కలెక్టర్ అకౌంట్‌లో జమ చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 5నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ జిల్లా నుంచి గొర్రెల కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. లబ్ధిదారులు తమ వాటా ధనాన్ని త్వరగా కలెక్టర్ అకౌంట్‌లో జమ చేయాలన్నారు. జిల్లా పశువైద్యాధికారి మాట్లాడుతూ లబ్ధిదారులు తమ కుల ధ్రువీకరణ, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, నామినీ ఆధార్ జిరాక్స్‌లను సంబంధిత పశువైద్యాధికారులకు అందజేయాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొక్యూర్‌మెంట్ టీమ్‌లు ఏర్పాటు చేశామని, ప్రతీ మండలానికి ఒక అధికారిని నియమించినట్లు పేర్కొన్నారు. వీరి ఆధ్వర్యంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా ఉంటుందన్నారు. సమావేశంలో మండల పశువైద్యాధికారి మురళీకృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు

బీఎస్పీ సభ విజయవంతం చేయాలి

పెంచికల్‌పేట్: గుండాయిపేట్ గ్రామంలో ఈనెల 29న నిర్వహించనున్న బీఎస్పీ బహిరంగసభకు మండలంలోని బీఎస్పీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండ రాంప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నట్లు తెలిపారు. గుండాయిపేట్ గ్రామంలో బుద్ధవిహార్ ప్రారంభోత్సవం, భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఎస్పీ మండల అధ్యక్షుడు పాగిడె ఆశన్న, కార్యదర్శి కామెర బాబాజీ, నాయకులు ఆశన్న, బాపురావు, నాందేవ్ ఉన్నారు.



మాట్లాడుతున్న రాంప్రసాద్

రమాబాయికి ఘన నివాళి

వాంకిడి: బీఆర్ అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి 88వ వర్ధంతిని మండల కేంద్రంలోని జెత్తవాన్ బుద్ధ విహార్‌లో బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమాబాయి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు ఉప్రె జైరాం, నాయకులు అశోక్ మహోల్కర్, విజయ్ ఉప్రే, శ్యాంరావు దుర్గే, సునీల్ దుర్గే, విలాస్, రోషన్, జయంత్‌కుమార్, విట్టల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బౌద్ధులు

న్యూట్రిషన్ ప్లస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో శనివారం న్యూట్రిషన్ ప్లస్ టీం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ ఎస్సైలు అంజన్న, రాజ్యలక్ష్మి, వైద్యులు సాయివివేక్‌లు పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. వారంలో మూడుసార్లు ప్రజలకు ఉచి తంగా మజ్జిగ పంపిణీ చేస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్న న్యూట్రిషన్ ప్లస్ టీం సభ్యులను వారు అభినందించారు. నిర్వాహకులు సుమి త్, సభ్యులు ప్రకాశ్ కట్వాని, రాహుల్ బియాని, నికూరె నాగేందర్, సురేందర్‌రావు, హెచ్.రాజన్న, సతీశ్, ఫారుఖ్, కార్తిక్, దేవ, లక్ష్మి, బియాని, పూజ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు లేక తిప్పలు



వాంకిడి మండల కేంద్రంలో కొనసాగుతున్న రహదారి పనులు

- గుత్తేదారు జాప్యంతో పూర్తికాని పనులు
- దుకాణాలకు అడ్డుగా అసంపూర్తి సైడ్‌డ్రెయిన్‌లు
- గిరాకీలు రాక వ్యాపారుల అవస్థలు
- వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలని వేడుకోలు



నిర్మాణ దశలోనే సైడ్‌డ్రెయిన్

వాంకిడి: మండల కేంద్రం గుండా నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి –363 నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం వల్ల ప్రజలు, దుకాణ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణంలో భాగంగా ప్రజల సౌకర్యార్థం రహదారికి ఇరువైపుల నిర్మించాల్సిన సర్వీస్ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. నెలల తరబడి మండలంలో ఇదే పరిస్థితి ఉన్నా ప్రజాప్రతినిధులు నోరు మెదపడం లేదు. గతేడాది మండల కేంద్రంలోని సరాండి ఎక్స్‌రోడ్ నుంచి మసీదు గుండా జిల్లా పరిషత్ పాఠశాల వరకు ఒకవైపు మాత్రమే సర్వీసు రోడ్డు నిర్మించారు. దానికి ఎదురుగా ఆవలివైపు ఉన్న పెట్రోల్ బంకు లైనుకు ఇప్పటి వరకు సర్వీస్ రోడ్డు నిర్మించలేదు. గతంలో సర్వీస్ రోడ్డుపై కనీసం మొరం కూడా వేయకపోవడంతో బైపాస్ రోడ్డు పనులను స్థానికులు అడ్డుకున్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ నాసిరకమైన మొరం మట్టితో తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నెలలు గడిచినా రోడ్డుపై బీటీ వేయలేదు. నిర్మించాల్సిన సైడ్ డ్రెయినేజీలు కూడా పూర్తి చేయలేదు. రానున్న వర్షాకాలంలోపు సర్వీస్ రోడ్డు పనులు పూర్తి కాకుంటే గిరాకీలు రాక అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందని వివిధ వ్యాపారాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సుమారు 50 దుకాణాలకు ఇబ్బందులు..

మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు నుంచి పోచమ్మ గుడి వరకు మెకానిక్ షాపులు, పంక్చర్ షాపులు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, ఫర్టిలైజర్ షాపులు, కటింగ్ షాపులు వంటి వివిధ రకాల దుకాణాలు సుమారు 50 వరకు ఉన్నాయి. నిత్యం జనాలతో కళకళలాడే దుకాణాలు రోడ్డు నిర్మాణంలో చేపడుతున్న జాప్యంతో వెలవెల బోతున్నాయి. సైడ్ డ్రెయినేజీల నిర్మాణంలోనూ గుత్తేదారు నిర్లక్ష్యానికి వ్యాపారులు బలి కావాల్సి వస్తుంది. ఒక చోట పనులు ప్రారంభించి పూర్తికాక ముందే మరోచోట పనులు చేపడుతున్నారు. కాగా మంచిర్యాల నుంచి రెబ్బెన, ఆసిఫాబాద్ వరకు చకచక పనులు సాగుతుండగా వాంకిడిలో మాత్రం పనులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో అధికారులను నిలదీసే పెద్ద గొంతు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పనుల్లో జరుగుతున్న జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన సైట్ ఇంజనీర్ సూర్యను ఫోన్‌లో వివరణ కోరేందుకు సంప్రదించగా వివరణ ఇచ్చే అధికారం తనకు లేదని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

గిరాకీ తగ్గింది



నేను మండల కేంద్రంలో కటింగ్ షాపు నిర్వహిస్తున్నా. షాపునకు ఎదురుగా 50 మీటర్ల మేర సైడ్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టి అలాగే వదిలేశారు. రెండు వారాలు కావస్తున్నా అధికారులు ఇటువైపు తిరిగి చూడటం లేదు. సర్వీసు రోడ్డు కూడా నిర్మించకపోవడంతో గిరాకీ తగ్గింది.

– పోలాజీ సాయి, సెలూన్ నిర్వాహకుడు

అద్దె చెల్లించడం కష్టంగా మారింది



కొన్నేళ్లుగా పెట్రోల్ బంకు ప్రాంతంలో టైర్ పంక్చర్ షాపు నడుపుతున్నా. సర్వీసు రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనాలు ఇటువైపు వచ్చేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో గిరాకీ లేదు. రోజువారి కూలీ కూడా పడటం లేదు. అద్దె చెల్లించడం కూడా కష్టంగా మారింది.

– అల్లోజు రవీందర్, టైర్ పంక్చర్ షాపు నిర్వాహకుడు

కాలువ మరమ్మతు పనులకు భూమిపూజ

రెబ్బెన: గత సంవత్సరం కురిసిన అధిక వర్షాలతో దెబ్బతిన్న గోలేటి రిజర్వాయర్ ఎడమ కాలువ మరమ్మతు పనులకు శనివారం జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, గోలేటి సర్పంచ్ పోటు సుమలతలు భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ అధిక వర్షాలతో గండిపడడంతో రిజర్వాయర్ ఎడమ కాలువ దెబ్బతిందన్నారు. కాలువ మరమ్మతు పనులకు ఎమ్మెల్యే సక్కు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రూ.18లక్షలు మంజూరయ్యాయన్నారు. టెండర్ ద్వారా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

నిప్పంటుకొని వరిగడ్డి దగ్ధం

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన వడాయి రాజయ్య, నాగోసే లక్ష్మణ్ అనే రైతులకు చెందిన వరిగడ్డి కుప్పలు అగ్ని ప్రమాదానికి శనివారం దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని చెరువు దగ్గర వరిగడ్డి కుప్పలను బాధిత రైతులు నిల్వ ఉంచారు. సమీపంలో మరో రైతు ప్రవీణ్ వరి కొయ్యలకు నిప్పుపెట్టగా ప్రమాదవశాత్తు వరిగడ్డి కుప్పలకు నిప్పంటుకోవడంతో దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. ప్రమాదంలో రూ.6 వేల వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు.



దగ్ధమవుతున్న వరిగడ్డి కుప్పలు

పనులు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి వద్ద పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను శనివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ఉన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :

9010608462

Office mail : knrjagati@gmail.com

సాక్షి

పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

కొమురంభీం ఆసిఫాబాద్ :

తిరుపతి, ACO - 7997958206

సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661

టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899